

'సూక్తం' అంటే మంచిమాట. 'బాగా చెప్పింది' అనే అర్థం కూడా ఉంది. సమగ్రంగా నిరూపణ చేయడాన్ని కూడా 'సూక్తం' అని అంటారు. ఈ అర్థాలన్నిటినీ సమన్వయం చేస్తే.. మనిషికి సమున్నతమైన మార్గదర్శనం చేసే బోధన 'సూక్తం' అని చెప్పొచ్చు. ప్రకృతి పరిణామ కమం, దానిపై మనిషికి ఉండాల్సిన అవగాహన, చేయాల్సిన పనులు, చేయకూడని చర్యలు, సాధించాల్సిన అద్వైతభావన మొదలైన విషయాలన్నిటినీ వేదాల్లోని సూక్తాలు వివరిస్తాయి.

# ప్రపంచం.. పంచ సూక్తాత్మకం

భక్తుడి మనసు ఎప్పుడూ నిశ్చలంగా ఉండటానికి, పరమాత్మ మీద లగ్నం కావడానికి భారతీయ రుషులు ప్రతిపాదించిన ప్రాథమిక సూచన వేద సూక్త పఠనం. నిజానికి ఇవి వేదాల్లో ఒకే చోట, ఒకే మంత్రభాగంగా ఉండవు. విభిన్న భాగాల నుంచి గ్రహించిన మంత్రాలతో సూక్తం తయారవుతుంది. వేదంలో చెప్పిన కొన్ని పరమ ప్రామాణికమైన అంశాలు, మనిషికి అత్యవసరంగా అందాల్సిన సందేశాన్ని గుర్తించి మహర్షులు చేసిన క్రోడీకరణే సూక్తాలు. నాలుగు వేదాల్లో వందలాదిగా ఉన్న సూక్తాల్లో పురుషసూక్తం, శ్రీసూక్తం, నారాయణసూక్తం, భూ, నీలాసూక్తం... పంచసూక్తాలుగా ప్రసిద్ధిపొందాయి.

## పురుష సూక్తం

'పురుష' అనే పదానికి భగవంతుడు అని అర్థం చేసుకోవాలి. విశ్వానికి మూలశక్తి అయిన విరాట్పురుషుడి స్వరూప, స్వభావ వర్ణన, విశ్లేషణ ఈ సూక్తంలో ప్రధానంగా ఉంటాయి. సాధారణభావనలో మనం ఊహించుకునే విష్ణుమూర్తి, పురుషసూక్తం ప్రకటించే నారాయణుడు ఇద్దరూ వేర్వేరు. ఈయన త్రిమూర్తుల్లో ఒకరైన విష్ణువు కన్నా పూర్వమే ఉన్నాడు. విశ్వం ఆవిర్భావానికి మూలకారణశక్తి ఇతనే .

**ఓం తచ్ఛంయో రావృణీమహే**
**గాతుం యజ్ఞాయ గాతుం యజ్ఞపతయే...**

అనే ప్రసిద్ధ మంత్రంతో పురుషసూక్తం ప్రారంభమవుతుంది. ఇందులో సకల దేవతల స్వరూపంగా విరాజిల్లే విరాట్పురుషుడి వైభవాన్ని శ్లాఘిస్తారు. భగవంతుడి సంకల్పంతోనే సృష్టి జరుగుతుందని, ఈ సృష్టి కార్యమంతా ఓ యజ్ఞమని చెబుతుంది. దానికి కారకులైన వారికి, ఈ యజ్ఞాన్ని నిర్వహించేవారికి, ఇందులో భాగం తీసుకున్న ప్రతి ఒక్కరికీ, చివరకు పశు పక్ష్యాదులతో సహా ప్రతి ప్రాణికీ శుభం కలగాలని ఆశిస్తూ పురుష సూక్తం ఆరంభమవుతుంది. 'సబ్రహ్మః, సశివః, సహరిః– అతనే బ్రహ్మ, అతనే శివుడు, అతనే హరి' అంటుంది పురుష సూక్తం. అమ్మవారి ఆలయమైనా, శివాలయమైనా, విష్ణ్వాలయమైనా పూజించే దేవుడు ఎవరైనా సరే అన్ని ఆలయాల్లోనూ మంత్రపుష్పంలో చెప్పే పురుష సూక్త భాగం ఇది. దైవశక్తి అంతటా నిండి ఉందనే అద్వైతభావాన్ని పురుష సూక్తం ప్రబోధిస్తోంది. విశ్వమంతా నిండి ఉన్న పరమాత్మ చైతన్యం ఒక్కటే. దాన్ని ఎవరు ఏ శక్తిగా భావించి పూజిస్తారో ఆ శక్తిరూపంలోనే ఆ చైతన్యం వ్యక్తమవుతుందనే విషయాన్ని పురుష సూక్తం విస్పష్టంగా ప్రకటిస్తుంది. అద్వైత భావనకు పురుష సూక్తం పునాదిగా నిలుస్తుంది.

### ఎక్కడ ఉంది?

రుగ్వేదం పదో మండలంలో ఈ సూక్తం ఉంది. కృష్ణయజుర్వేదం అరణ్యకం, 3వ ప్రపాఠకంలో, 12వ అనువాకంలో కూడా పురుష సూక్తం కనిపిస్తుంది. యజుర్వేదంలో 'నారాయణ ఉపస్థాన మంత్రం', 'ఉత్తర నారాయణ అనువాకం' పేర్లతో ఈ సూక్తాన్ని పేర్కొన్నారు.

## నీలాసూక్తం

సామవేదంలో ప్రస్తావించిన 'స్తోమత్రయస్త్రింశం' అనే హోమానికి సంబంధించిన మంత్రాలు ఈ సూక్తంలో ప్రధానాంశాలు. ఈ సూక్తంలో ఆకాశానికి సంబంధించిన అంశాలుంటాయి. భూమికి ఊర్ధ్వదిశలో ఉండే నింగి ప్రాణికోటి అవసరాలు ఎన్నిటినో తీరుస్తుంది. భూమికి, ఆకాశానికి మధ్య సంబంధం, సూర్యగమనం, దిక్కులకు సంబంధించిన ప్రస్తావన ఇందులో ఉంది. మన వాతావరణంలో అనేక వాయువులు ఉంటాయి. వీటిలో ప్రత్యేకించి 'మాతరిష్వ' అనే వాయువు గురించి నీలాసూక్తం ప్రత్యేకంగా ప్రస్తావిస్తుంది. దీనికి దక్షిణ దిక్కు నుంచి వీచేగాలికి మాతరిష్వ అని పేరు. ప్రాణులను సంరక్షించే వాయువనే అర్థం కూడా ఉంది.ఈ సర్వ వ్యాపకమైన వాయువును గురించి వివరణ ఇక్కడ కనిపిస్తుంది. నీలాసూక్తంలో భూమిని విష్ణుపత్నిగా సంబోధిస్తుంది వేదం. ఇక్కడ విష్ణుపత్ని అంటే విష్ణువును పరిపాలకుడిగా కలిగినది అనే అర్థం చేసుకోవాలి. ప్రకృతిని సంరక్షించుకోవాలనే సందేశం అంతర్లీనంగా ఉంది.

### ఎక్కడుంది?

కృష్ణయజుర్వేదం ఒకటో కాండ 7వ పన్నం, 10వ అనువాకంలో కొంత భాగం, 4 కాండ, 4వ పన్నంలో కొంత భాగం కలిపి నీలాసూక్తంగా మహర్షులు పేర్కొన్నారు.

## నారాయణ సూక్తం

పురుషసూక్తం విశ్వ వ్యాప్తమైన విరాట్ స్వరూపాన్ని పరబ్రహ్మ స్వరూపంగా, నారాయణుడిగా ప్రకటించింది. నారాయణ సూక్తం ఆ పరబ్రహ్మన్ని నారాయణ స్వరూపంలోనే పూర్తిగా విశదీకరించింది. ఇందులో ప్రధానంగా రెండు భాగాలు కనిపిస్తాయి. మొదటి భాగంలో భగవంతుడి మహిమ ప్రకటితమవుతుంది. రెండో భాగంలో ఆ భగవంతుడిని ఎలా, ఏవిధంగా, ఎక్కడ ధ్యానం చేయాలో, మనసును ఎలా లగ్నం చేయాలో వివరణత్మాకంగా ఉంటుంది.

**నారాయణ పరో జ్యోతిరాత్మా నారాయణ పరః**
**నారాయణ పరం బ్రహ్మ తత్త్వం నారాయణః పరః**
**నారాయణ పరో ధ్యాతా ధ్యానం నారాయణః పరః**

విశ్వమంతా జ్యోతిస్వరూపంగా నిండి ఉన్నవాడు నారాయణుడే. ఆయనే పరబ్రహ్మ. నారాయణుని ధ్యానం చేసేవారిలో శ్రేష్ఠుడు నారాయణుడే అంటుందీ సూక్తం. సర్వోన్నతమైన ప్రతి అంశంలోనూ నారాయణ అంశను, నారాయణ తత్త్వాన్ని దర్శించడం ఇందులో ప్రధాన విషయం. ప్రపంచానికి లోపల, బయటా, కనిపించేదీ, వినిపించేదీ కూడా నారాయణుడే. సముద్రేంతం విశ్వశంభువం... పద్మకోశ ప్రతీకాశగ్ం హృదయంచాప్యధోముఖం..' సముద్రానికి అవతల భగవంతుడు ఉంటాడని ఈ మంత్రభాగానికి అర్థం. ఇక్కడ సముద్రమంటే సంసార సాగరం అని అర్థం చేసుకోవాలి. కోరికలు, భావోద్వేగాలనే అలలతో సంసార సాగరం ఎప్పుడూ కల్లోలంగా ఉంటుంది. సాధకుడు వీటిని అదుపులో ఉంచుకోవాలి. ఇది జరిగితే ధ్యానంలో మనసు లగ్నమవుతుంది. అంతిమంగా ఆ అనంతుడి సాక్షాత్కారం సాధ్యమవుతుంది.

### ఎక్కడుంది?

కృష్ణయజుర్వేదం అరణ్యకభాగం... నారాయణోపనిషత్తు, 13వ అనువాకంలో...

## శ్రీసూక్తం

శ్రీ అంటే సంపద, లక్ష్మి అనే అర్థాలు ఉన్నాయి. పరమాత్మ అనంతమైన శక్తుల్లో లక్ష్మీశక్తి ఒకటి. జగత్తును పోషించేందుకు ఈ శక్తి చాలా అవసరం.

ఓం హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణరజతస్రజామ్/ చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మమావహ.. శ్రీసూక్తంలో తొలి మంత్రమిది. ఇక్కడ లక్ష్మి అంటే మనం చూసే లౌకిక సంపద కాదు. ఎప్పటికీ తొలగిపోని, తరిగిపోని జ్ఞాన సంపదే అసలైన లక్ష్మి. యజ్ఞానికి ముఖ్యదేవత అగ్ని. ఇతని ద్వారా లక్ష్మీదేవిని ఆహ్వానిస్తారు. అగ్ని జ్ఞానానికి సంకేతం. అగ్ని ద్వారా లక్ష్మిని ఆహ్వానించడం అంటే జ్ఞానసంపదను ఆరాధించడమే. ఈ భావాన్ని కొనసాగిస్తూ శ్రీసూక్తంలోని రెండో మంత్రం 'లక్ష్మీం అనపగామినీం' అంటుంది. అంటే ఎప్పటికీ తొలగిపోని లక్ష్మి కావాలని కోరుకుంటాడు భక్తుడు. ఎప్పటికీ తొలగిపోని సంపద తత్వజ్ఞానం. తనను తాను తెలుసుకునే ఆత్మజ్ఞానం. ఆ జ్ఞానాన్నివ్వాలని లక్ష్మీస్వరూపంలో ఉన్న ప్రకృతి స్వరూపిణికి భక్తుడు శ్రీసూక్తం ద్వారా విన్నవించుకుంటాడు.

### ఎక్కడుంది?

శ్రీ శక్తిని ఆరాధించే ఈ మంత్ర భాగం రుగ్వేదంలో కనిపిస్తుంది.

## భూసూక్తం

మనిషి ఈ లోకంలోకి ఒంటరిగా వచ్చాడు. ఇక్కడ అతడు నిలబడటానికి భూమి ఆధారంగా నిలిచింది. ఎదగటానికి అవసరమైన అన్ని పదార్థాలను భూమాతే ఇచ్చింది. చివరగా భౌతికమైన దేహాన్ని విడిచిపెట్టిన తర్వాత దాన్ని కూడా తనలోనే కలిపేసుకుంటుంది. అందుకే భూమిపై మనిషికి కృతజ్ఞత తప్పనిసరిగా ఉండి తీరాలి. భూమి చూపిస్తున్న ఉదారతకు, ఆమెను దైవంగా ఆరాధించాలనే భావనను కలిగించే వేద మంత్ర భాగమే భూసూక్తం.

**'యత్ తే మధ్యం పృథివి యచ్చ నభ్యం యాస్త ఊర్జస్తన్వః సంబభూవుః తాసు నోధే హ్యభినః పవస్వ... మాతాభూమిః పుత్రోహం పృథివ్యాః పర్జన్యః పితాన ఉనః పిపర్తు...** ' భూమిని తన తల్లిగా, తనను భూమి పుత్రుడిగా భావించాల్సిన కర్తవ్యాన్ని మనిషికి ఈ మంత్రం సదా గుర్తుచేస్తుంది. వైదిక సంప్రదాయంలో భూమిని కేవలం నివాసయోగ్యతను కలిగించిన జడరూపమైన పదార్థంగా భావించలేదు. భూమితో ఒకవిధమైన అనుబంధాన్ని వేదం మనిషికి కలిగించింది. ఈ భూమిపై ఉన్న ప్రతి మట్టికణంలో దివ్యత్వాన్ని దర్శింపచేసుకోవాల్సిన అవసరాన్ని వేదం ప్రకటిస్తుంది.

### ఎక్కడుంది?

అధర్వణ వేదంలో, యజుర్వేదంలో ఈ మంత్ర భాగాలు కనిపిస్తాయి.

... శ్రీ భారతి

# పేదరికం అడ్డు కాదు!

'భక్తియోగో నిరుపద్రవః, భక్తియోగాన్ముక్తిః' అంటుంది త్రిపాద్విభూతి మహా నారాయణ ఉపనిషత్తు. అంటే 'భక్తి యోగం నిరపాయకరమైనది. దీనితో ముక్తి లభిస్తుంది' అని భావం. ఈ ఉపనిషత్ వాక్యానికి కింద పేర్కొన్న కథ భాష్యంగా కనిపిస్తుంది.

పూర్వం కాంచీపురాన్ని చోళచక్రవర్తి పాలించేవాడు. ఆయన గొప్ప విష్ణుభక్తుడు. ఆర్భాటంగా ఖర్చుపెట్టి ఎన్నో యజ్ఞాలు చేసేవాడు. ఒకనాడు సువర్ణ పుష్పార్చన చేశాక గుడికి 'విష్ణుదాసు'డనే బ్రాహ్మణుడు వచ్చి, తులసి దళాలతో దేవుణ్ని పూజించాడు. ఇది రాజుకు నచ్చలేదు. ఇదేం పూజ అన్నాడు. బ్రాహ్మణుడూ కోపించి, 'నీకు భక్తి లేదు.' అన్నాడు. చోళరాజు వెటకారంగా 'నేనెన్ని క్రతువులు చేశానో తెలుసా! ఎవరు ముందు విష్ణు సాక్షాత్కారాన్ని పొందుతారో చూద్దాం' అనే ముద్గలుడనే ముని ఆధ్వర్యంలో గొప్ప విష్ణుయాగం సంకల్పించాడు. బ్రాహ్మణుడు దీక్షగా కార్తీక వ్రతం, షోడశోపచార పూజలు, కీర్తనలతో ఆరాధించసాగాడు.

ఒకనాడు విష్ణుదాసుని ఆహారాన్ని ఒక దొంగ అపహరించాడు. వరుసగా వారం రోజులూ అలాగే జరిగింది. విష్ణుదాసునికి అన్నం లేదు. అయినా దైవారాధన మానలేదు. ఒకరోజు దొంగను కనిపెట్టాలని నక్కి కూర్చుంటే ఒక చండాలుడు వచ్చాడు. అస్థి పంజరం లాంటి శరీరం. ఆకలితో ఆరాటం. బ్రాహ్మణుడెంతో బాధపడ్డాడు. వాడు ఆహారాన్ని దొంగిలించుకొని పోతుంటే.. 'ఆగవయ్యా! కేవలం అన్నం ఎలా తింటావు? ఈ నెయ్యి కూడా కలుపుకొని ఆరగించు' అని దొంగ వెంటపట్టాడు విష్ణుదాసుడు. భయంతో వాడు పారిపోతూ ఒకచోట సొమ్మసిల్లి పడిపోయాడు. విష్ణుదాసుని సపర్యలతో తేరుకున్న చండాలుని స్థానంలో శ్రీహరి సాక్షాత్కరించాడు. బ్రాహ్మణుడు కన్నులారా దర్శించి 'నారాయణా! కరుణించావా స్వామీ! నేయి వేసుకుని కడుపారా భుజించు' అని అన్నం ముద్ద నివేదించాడు. శ్రీహరి ఆరగించాడు. దేవతలు ఆశ్చర్యపోయారు. శ్రీహరి విష్ణుదాసుని కౌగలించుకొని, సారూప్యాన్నిచ్చి, వైకుంఠానికి బయల్దేరమన్నాడు. చోళరాజు ఇది చూడగలిగాడు. ముద్గలునితో 'మహర్షీ! నిరుపేద విప్రుడు వైకుంఠానికి వెళ్తున్నాడే! ఐశ్వర్యం ఉండి, గొప్ప యజ్ఞాలు చేసి, భూరి దానాలు చేసినా నాకు ఏ లాభం లేకపోయింది. భగవంతుడిని చేరేందుకు భక్తి తప్ప మరొకటి లేదని తేలింది' అంటూ యజ్ఞాన్ని వదిలేసి హరినామ స్మరణతో హోమాగ్నిగుండంలో దూకాడు. చోళరాజును శ్రీహరి అక్కున చేర్చుకొని గుండం నుంచి వెలువడ్డాడు. అతనికీ సారూప్యా



న్నిచ్చాడు. తనతోపాటే వైకుంఠానికి కొనిపోయాడు. నిష్కల్మషుడైన భక్తుణ్ని భగవంతుడు ఎన్నటికైనా అనుగ్రహిస్తాడని పై కథ తెలియజేస్తుంది. ఆ భక్తుడు పేదవాడా, పెద్దవాడా అన్న మీమాంస దేవుడికి ఉండదు. (ఇవి కార్తీకపురాణం 51,52వ అధ్యాయాలు. 26 వ రోజు పారాయణం చేస్తారు)

... డా|| వెలుదండ సత్యనారాయణ

# లోకో భిన్న రుచిః

ఓ గ్రామీణ యువకుడు గురువు దగ్గరికి వచ్చాడు. తనకు పెద్దపెద్ద వ్యాపారాలు చేయాలని ఉన్నానని చెప్పాడు.

అయితే, 'నేను వ్యాపారం చేయలేనని కొందరు నిరుత్సాహ పరుస్తున్నార'ని బాధపడ్డాడు.

గురువు చిన్నగా నవ్వి 'మీ ఇంట్లో కుక్క మొరిగితే ఏమి చేస్తావు?' అని అడిగాడు.




'దానికి ఆకలైతే ఆహారం పెడతాను . కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చి ఉంటే దాన్ని సముదాయించి గొలుసుతో కట్టేస్తాను' అని బదులిచ్చాడు.

'అదే... ఎవరి ఇంట్లోని కుక్కో మొరిగితే ఏమి చేస్తావు?' అని మళ్లీ ప్రశ్నించాడు గురువు.

'ఎవరి ఇంట్లోని కుక్కో మొరిగితే నేనెందుకు పట్టించుకుంటాను. ఏ మాత్రం పట్టించుకోను' అన్నాడు.

'అదే పని ఇక్కడ కూడా చేయ్. 'లోకో భిన్న రుచిః' అని తెలిసిందే కదా. వారివారి అనుభవాలనుబట్టి వారు నీకు సలహాలు ఇస్తూ ఉంటారు. నీకు నచ్చితే స్వీకరించు. లేకుంటే వాటిని పక్కన పెట్టు. నీ మీద నీకు నమ్మకం ఉంటే చాలు. అదే పదివేలు. ఎప్పుడు కానీ ప్రపంచాన్ని మార్చాలని ప్రయత్నించకు. నిన్ను నీవు మార్చుకోవడానికి ప్రయత్నించు' అన్నాడు గురువు.

'మరి వారు చెప్పినట్లు సమస్యలు వస్తే...' రాగాలు తీస్తూ ప్రశ్నించాడు యువకుడు.

వెంటనే గురువు 'నువ్వు దారిలో పోతూ ఉంటే, నీకు ఎదురైన కుక్క ఏమి చేస్తుంది?' అని అడిగాడు.

'కొద్దిసేపు మొరిగి తన దారిన తాను పోతుంది' అని నెమ్మదిగా చెప్పాడు ఆ యువకుడు.

'కుక్క మాత్రమే వెళ్తుందా, లేక దాని తోక కూడా వెళ్తుందా?' అని అడిగాడు గురువు.

'కుక్కతో పాటు దాని తోక కూడా వెళ్తుంది' అని వెంటనే బదులిచ్చాడు ఆ యువకుడు.

'సమస్య కుక్క అయితే తోక దాని పరిష్కారం లాంటిది. కుక్క వెనుకే తోక ఉన్నట్లు సమస్య వెనుకే పరిష్కారం ఉంటుంది' అని ధైర్యం చెప్పాడు గురువు. 'తల అంటూ ఉంటే తలనొప్పి, మెడ అంటూ ఉంటే మెడ నొప్పి ఉంటాయి' అని గ్రహించిన ఆ యువకుడు ఆత్మ విశ్వాసంతో అక్కడినుంచి కదిలాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

# ఆ బాధ్యత దైవానిదే

'తమ ఆహారాన్ని మోసుకుంటూ తిరగలేని పశుపక్ష్యాదులు ఎన్నో ఉన్నాయి. అల్లాహ్ వాటికి ఉపాధిని సమకూరుస్తాడు. మీ ఉపాధి ప్రదాత కూడా ఆయనే. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ ఎరిగినవాడూను' అంటుంది ఖురాన్ (29:60). 'భూమ్యాకాశాలలోని నిక్షేపాల తాళపు చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. తాను కోరిన వారికి ఆయన పుష్కలంగా ఉపాధిని ఇస్తాడు. తాను కోరినవారికి ఆయన ఆచితూచి ఉపాధిని ఇస్తాడు' అని కూడా సెలవిచ్చింది. పక్షులు ఉషోదయాన ఆకలితో తమ గూళ్లను వదిలి, సంధ్యా సమయానికి కడుపు నింపుకొని తిరిగి తమ గూటికి వస్తాయి. వాటన్నింటికీ ఆహారాన్ని అందించేది దైవమే. ఈ సృష్టిలో జీవరాశుల పోషణ బాధ్యత అల్లాహ్‌దే అన్నది ఖురాన్ చెబుతున్నది. భూమిపై లెక్కలేనన్ని జంతువులు ఉన్నాయి, అవి తమ జీవనోపాధిని నిల్వ చేయవు. ఆహార సేకరణ గురించి చింతించవు. భూమిలోపల తలదాచుకుంటున్న కీటకాలు, చీమలు మొదలుకుని, ఆకాశంలో ఎగిరే పక్షులు, నీటిలో నివసించే చేపలు, ఇతరత్రా జీవరాశులన్నిటికీ ఆ దైవమే ఆహారాన్ని సమకూరుస్తున్నాడు. అసంఖ్యాకమైన పక్షులు, పశువులు వీటిలో ఏదీ తన ఉపాధిని తానే మోసుకుంటూ తిరుగదు. అవి ఎక్కడికి వెళ్లినా దైవానుగ్రహం వల్ల వాటికి ఏదో ఒక విధంగా ఉపాధి లభిస్తూనే ఉంటుంది. ఒక్కొక్క పిట్ట గూడును, ఒక్కొక్క పురుగు బిలాన్నీ అల్లాహ్ ఎరుగును. ఏ ప్రాణి ఎక్కడ ఉందో దైవానికి బాగా తెలుసును. అందుకే 'మీరు ఉపాధి గురించి యోచించి ధైర్యం సడలి కూర్చోకండ'ని మానవజాతికి సూచిస్తున్నాడు అల్లాహ్. పక్షుల మాదిరిగానే మానవులు కూడా ఉపాధి కోసం అన్వేషిస్తే తప్పకుండా అల్లాహ్ అనుగ్రహం లభిస్తుంది. చీమలు, కీటకాల ఆహారాన్ని అందించడానికి ఇంత శ్రద్ధ వహించినప్పుడు, సృష్టిరాశుల్లో ఉత్తమ జీవి అయిన మనిషి పై ఇంకెంత శ్రద్ధవహిస్తాడో కదా! అల్లాహ్ అనుగ్రహాన్ని, దయ స్వరూపాన్ని, కారుణ్యాన్ని మనిషి అర్థం చేసుకోలేకపోతున్నాడు. ఉపాధి కోసం అడ్డదారులు తొక్కి ద్రోహానికి పాల్పడుతుండటం విచారకరం. ఇలా అడ్డదారుల్లో ప్రయాణించిన వాళ్లు అంతిమ దినాన చింతించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దైవాన్ని విశ్వసించి, సన్మార్గంలో నడిచిన వారిపై అల్లాహ్ దయ సదా ఉంటుంది.




... ముహమ్మద్ ముజాహిద్,
96406 22076

# ధ్యానం శరణం గచ్ఛామి


తపస్సు చేయడానికి కారడవుల్లోకి వెళ్లాల్సిన పనిలేదు. హిమశిఖరాలపైకి చేరుకోవాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఉన్నచోటే ఉండి ధ్యానం కొనసాగించవచ్చు. ధ్యానం అంటే చంచలమైన మనసును జయించడానికి ఉపయోగకరమైన ఒక ఉపకరణం, ఒక పక్రియ. అనుక్షణం సంకల్ప వికల్పాలకు గురయ్యే మనసును అలా నిలబెట్టడమే ధ్యానం. ఆలోచనా రహిత శూన్యస్థితిలో ఉంచడమే ధ్యానం. మనసు శూన్యమైనప్పుడు మానవ చైతన్యం, విశ్వ చైతన్యంతో అనుసంధానమై మనిషికి తనేంటో తెలిసిపోతుంది. తను పుట్టింది ఎందుకో తెలుసుకుంటాడు. తన గురించే కాదు సాటి జీవుల గురించి ఆలోచించే స్థితికి చేరుకుంటాడు.

## శ్వాస మీద ధ్యాస

ధ్యానం చేయడం అంటే యజ్ఞం చేసినంత కష్టపడాల్సిన పనిలేదు. హాయిగా సుఖాసనంలో కూర్చొని, రెండు చేతులు కలిపి, చేతి వేళ్లు జోడించి.. సహజంగా సాగే శ్వాసక్రియపై దృష్టి సారించడమే! సహజంగా జరుగుతున్న ఉఛ్వాస, నిశ్వాసలను ఏకధారగా గమనించాలి. మధ్యలో మనసులో పలు ఆలోచనలు వస్తుంటాయి. వాటిని వదిలేస్తూ మళ్లీ శ్వాస మీద ధ్యాస ఉంచాలి. కొన్నాళ్ల సాధన తర్వాత ఓ రోజు మనసు ఆలోచనా రహిత స్థితిలోకి జారుకుటుంది. దాంతో ఆధ్యాత్మిక అవగాహన మొదలవుతుంది. గౌతముడు ధ్యాన సాధనతోనే బుద్ధుడిగా అవతరించాడు. ఆ ధ్యానమే సుమారు 2500 ఏండ్ల కిందట బుద్ధుడు ఆచరించిన 'ఆనాపాన సతి'. 'ఆన' అంటే లోపలకి వెళ్లే శ్వాస. 'అపాన' అంటే బయటకు వచ్చే గాలి. 'సతి' అంటే వాటితో కలిసి ఉండటం.

## ఆలోచనా రహిత స్థితిలో..

'పని చేస్తుంటే పని మీద ధ్యాస – పని లేకుంటే శ్వాస మీద ధ్యాస' అని బ్రహ్మర్షులు పేర్కొన్నారు. అంటే పని మీదే పూర్తి ధ్యాస పెట్టడంతో మీకు ఏ ఆలోచనలుండవు. మీరు చేస్తున్న పనిలో మీ నైపుణ్యాన్ని పూర్తిగా ఉపయోగించగలుగుతారు. పనిలేకుంటే శ్వాస మీద ధ్యాసతో అనవసరపు ఆలోచనలు మీ దరికి చేరవు. ధ్యానంతో అక్కరకు రాని సమాచారాన్ని వడబోసే సామర్థ్యం పెరుగుతుంది. తీసుకునే నిర్ణయాలు స్పష్టమైనవిగా ఉంటాయి. బుద్ధి వికసిస్తుంది. జీవన సౌందర్యం అవగతం అవుతుంది. దైవికశక్తి విశిష్టత తెలుస్తుంది. మనిషిని క్షణక్షణం వెంటాడే మరణ భయం కూడా మాయమైపోతుంది. అతీతమైన స్థితికి చేరిన మనిషికి చివరకు మిగిలేది అనంతమైన తృప్తి. అచంచలమైన విశ్వాసం. ఈ రెండూ సాధించిన మానవ జన్మ ధన్యమని అనకుండా ఉండలేం!



... రామకీర్తన



# ప్రయత్నంతోనే సత్ఫలితం

క్రీస్తు సందేశం

అడిగే పద్ధతి తెలియకే ఎన్నో విలువైనవి ఇవ్వకుండానే ఆగిపోతున్నాయి. అందుకే ప్రభువు 'మీకు ఇవ్వనివి అడగండి' అని సెలవిచ్చాడు. ఇంతకూ మనం వేదికే అంశం ఏమిటి? అది మన కోసమేనా? అందులో పరహితం ఏమైనా ఉందా? అనేది ప్రశ్న. అడిగినవి ఇవ్వకుంటే, వెదికినవి దొరకకపోతే, తట్టినప్పుడు తలుపు తీయకపోతే.. దూషించడం, నిరుత్సాహపడటం అవివేకం. వెదికే విధానం తెలియకనే ఏ మూల దాగిన వస్తువు ఆ మూలనే దాగి పోతున్నాయి. అందుకే 'వెదకండి.. మీకు దొరుకుతుంది' అంటున్నాడు ప్రభువు. ఈ వెదుకులాట ఐహికం, స్వార్థం అయితే, ఎలా దొరుకుతాయి? మనిషి జీవితం సాధించుకోవడంతోనే సార్థకం అవుతుంది. ఆ సాధనలో పరుల హితం కూడా భాగమైతే మరింత రాణిస్తుంది. ప్రభువు నిర్దేశించినట్టు ప్రయత్నంతోనే ఫలితం సాధ్యమవుతుంది.

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024